సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)
శనివారం । 1 । ఫిబ్రవరి । 2025



ప్రమాణ స్వీకారానికి బ్రేక్!

వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారానికి ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అడ్డుగా మారింది.

- 8లో▸



కేయూ రిజిస్ట్రార్‌గా రామచంద్రం

కాకతీయ యూనివర్సిటీ నూతన రిజిస్ట్రార్‌గా దూరవిద్య కేంద్రం పొలిటికల్ సైన్స్ విభాగం ప్రొఫెసర్ రామచంద్రంను నియమించారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
33⁰ /18⁰

వాతావరణం

ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం వేళ ఎండ ఉంటుంది. రాత్రి సమయంలో చలితోపాటు పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

దరఖాస్తు గడువు పొడిగింపు

కాజీపేట అర్బన్: దివ్యాంగులకు ఆర్థిక ప్రోత్సాహక పథకం (ఎకనామికల్ రిహాబిలిటేషన్ స్కీం) దరఖాస్తు గడువును ఈ నెల 12వ తేదీ వరకు పొడిగించినట్లు హనుమకొండ జిల్లా స్త్రీ,శిశు సంక్షేమాధికారి జయంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన దివ్యాంగులు ఆన్‌లైన్‌లోtgobmms.cgg. gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

బీసీలంతా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి



కేయూ క్యాంపస్: తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని అందుకోసం బీసీలంతా ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని బీసీ జేఏసీ నాయకుడు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి సుందర్‌రాజ్ యాదవ్ పిలుపునిచ్చారు. ఈనెల 2న బీసీల రాజకీయ యుద్ధభేరి సభ నేపథ్యంలో శుక్రవారం హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్‌కళాశాల సభా ప్రాంగణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీల నిరుద్యోగులకు శాపంగా ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు వచ్చాయన్నారు. ఈడబ్ల్యూఎస్‌ను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. బీసీల రక్షణ కోసం అట్రాసిటీ చట్టం తేవాలన్నారు. ఈనెల 2న హనుమకొండలో జరగబోయే బీసీల రాజకీయ యుద్ధభేరికి రాష్ట్రం నలుమూలల నుంచి తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో బీసీ జేఏసీ నాయకులు బొనగాని యాదగిరి, పులిరాజ్, వి.నరేందర్, సురేందర్‌గౌడ్, బయ్యస్వామి, చిర్రా సోమయ్య, రమేశ్, అరుణ, ఆడెపు రవీందర్, రాజ్‌గోపాల్, వివేకానంద పాల్గొన్నారు.

ముగిసిన ఉపాధ్యాయుల శిక్షణ

కేయూ క్యాంపస్: హనుమకొండ జిల్లాలో 143 పాఠశాలల నుంచి ఎంపిక చేసిన ఉపాధ్యాయులకు కెరీర్ కౌన్సెలింగ్, గైడెన్స్‌పై రెండు రోజులుగా హనుమకొండ ఢిల్లీ పబ్లిక్‌స్కూల్‌లో నిర్వహిస్తున్న శిక్షణ శుక్రవారం ముగిసింది. ముగింపు సమావేశంలో జిల్లా క్వాలిటీ కో–ఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్ మాట్లాడుతూ.. కౌమార దశలో విద్యార్థులు ఎదుర్కొనే ఒత్తిళ్లను వాటికి పరిష్కార మార్గాలను కౌన్సెలింగ్ ద్వారా తెలియజేయాలన్నారు. సైకియాట్రిస్ట్ డాక్టర్ జగదీశ్‌బాబు, సైకాలజిస్ట్ శివప్రసాద్‌లు.. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. శిక్షణలో రిసోర్స్‌పర్సన్లుగా సీహెచ్ శ్రీనివాస్, అయిత శ్రీనివాస్, సునీత, కృష్ణమూర్తి, డీఎల్ ఎంటీ రఘు తదితరులు పాల్గొన్నారు.

చట్టపరమైన సేవలకు లీగల్ ఎయిడ్ క్లినిక్



కాజీపేట అర్బన్: సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చట్టపరమైన సహాయం అందజేసేందుకు బాలలకు లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి క్షమాదేశ్‌పాండే తెలిపారు. హనుమకొండ సుబేదారిలోని బాల రక్షాభవన్‌లో శుక్రవారం జువైనల్ కోర్ట్ న్యాయమూర్తి ఫరిహా అహ్మద్‌తో కలిసి లీగల్ ఎయిడ్ క్లినిక్ సేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే ప్రారంభించి మాట్లాడారు. బాలలకు, తల్లిదండ్రులకు చట్టాలపై అవగాహన తప్పనిసరిగా ఉండాలని, చట్ట వ్యతిరేక పనులకు పిల్లలు పాల్పడకుండా తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో జువైనల్ బోర్డ్ సభ్యులు మేరుగు సుభాష్, గోపికరాణి, డీసీపీఓ ప్రవీణ్‌కుమార్, బీఆర్బీ విభాగం పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాలు విడుదల

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాల (అటానమస్) డిగ్రీ కోర్సుల ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ మొదటి, మూడో, ఐదో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను శుక్రవారం ఆకళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి, నియంత్రణాధికారి ఆచార్య రాజేందర్ విడుదల చేశారు. మొదటి సెమిస్టర్ పరీక్షల్లో 1,355 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. అందులో.. 592 మంది ఉత్తీర్ణత (43.59శాతం) సాధించారు. మూడో సెమిస్టర్‌లో 1,024 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవ్వగా 601మంది ఉత్తీర్ణత (58.69శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఐదో సెమిస్టర్ పరీక్షలో 798 మంది పరీక్షలు రాయగా.. వారిలో 519 మంది (65.04శాతం) ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. పరీక్షలు నిర్వహించిన 45 రోజుల్లోనే ఫలితాలు వెల్లడించినట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పుల్లా రమేశ్, పరీక్షల విభాగం అధికారులు గిరిప్రసాద్ పాల్గొన్నారు.

సీతమ్మ కరుణించేనా?

కేంద్ర బడ్జెట్‌లో ‘ఓరుగల్లు’కు వరాల జల్లు కురిసేనా?

- రైల్వేలైన్లు, స్టేషన్లకు విడుదల కాని నిధులు
- కోచ్ ఫ్యాక్టరీకి పెద్దపీట వేస్తేనే ఆగస్టు నాటికి పూర్తి
- ఉమ్మడి వరంగల్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీల వినతి
- గత బడ్జెట్‌లో ప్రతిపాదించినా దక్కని ఫలితం
- స్మార్ట్‌సిటీ, ఫుడ్‌ప్రాసెసింగ్, ప్రాజెక్టులకు కేటాయింపులపై ఆశలు
- నేడు పార్లమెంట్‌లో నిర్మలమ్మ 2025-26 బడ్జెట్



సాక్షిప్రతినిధి, వరంగల్ :

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే 2025–26 బడ్జెట్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాకు ఏ మేరకు నిధుల వాటా దక్కనుంది?.. ఈసారైన కేంద్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపుల విషయమై కరుణిస్తుందన్న ఆశతో ఓరుగల్లు ప్రజలు ఎదురు చూస్తున్నారు. కేంద్ర బడ్జెట్ నేపథ్యంలో భారీ ఆశలు పెట్టుకున్న రాష్ట్ర ప్రభుత్వం రూ.1.63 లక్షల కోట్లతో చేసిన ప్రతిపాదనల్లో ఉమ్మడి వరంగల్‌కు చెందిన పలు అంశాలను చేర్చినట్లు పార్టీవర్గాల సమాచారం. ఈ నేపథ్యంలో తెలంగాణలో హైదరాబాద్ తర్వాత అభివృద్ధి చెందాల్సిన వరంగల్‌కు ఈసారైన ప్రాధాన్యం దక్కుతుందన్న ఆశాభావం వ్యక్తమవుతోంది. ఇప్పటికే ఉమ్మడి వరంగల్‌కు సంబంధించిన పలు అంశాలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ కడియం కావ్య, పోరిక బలరాం నాయక్ ప్రకటించారు.

గ్రేటర్ వరంగల్ స్మార్ట్‌సిటీ పనులకు నిధుల సమస్య తీరడం లేదు. ఈ పథకం కింద రూ.981 కోట్లతో చేపట్టిన పనులు నిధుల లేమి కారణంగా ఇప్పటికీ పూర్తి కాలేదు. ఏటా బడ్జెట్‌లో దేశవ్యాప్తంగా స్మార్ట్‌సిటీలకు కేటాయింపులున్నా వరంగల్‌కు వచ్చే నిధుల విడుదల్లో ప్రతీసారి చిన్నచూపే. ఫలితంగా ఓరుగల్లు స్మార్ట్‌సిటీ కల నెరవేరడం లేదు.

విలువ ఆధారిత పరిశ్రమలకు పెద్దపీట వేస్తామని చెబుతున్నా.. ఆ దిశగా ప్రయత్నం జరగడం లేదు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 8 లక్షల మంది రైతులు 19 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. వరి, పత్తి, మొక్కజొన్నతో పాటు మిర్చి, పసుపు సాగవుతున్నాయి. కేంద్రం రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడానికి ఏటా మద్దతు ధరను పెంచడంతోపాటు పంటలకు విలువ ఆధారిత పరిశ్రమల (ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు) ఏర్పాటుకు ఈసారైనా నిధులు ఇవ్వాలన్న డిమాండ్ ఉంది. పసుపు, పత్తి, మిర్చి, మామిడి, మొక్కజొన్నలో నాణ్యమైన విత్తనాలను రూపొందించడానికి పరిశోధన స్థానాలను ఏర్పాటు డిమాండ్ పెండింగ్‌లో ఉంది.

వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లో స్పిన్నింగ్, కలర్‌డై యార్న్ మిల్లుల ఏర్పాటు ప్రతిపాదనకు మోక్షం కలగలేదు.

ప్రతీజిల్లాకు కేంద్రీయ, నవోదయ విద్యాలయాలు, హనుమకొండలో సైనిక్ పాఠశాలను ఏర్పాటు చేయాలనేది ప్రజలకు తీరని కోరికలుగానే ఉన్నాయి.

వరంగల్ మామునూరులో నిజాం కాలంలో నిర్మించిన విమానాశ్రయాన్ని అభివృద్ధి చేయాలని ఓరుగల్లు వాసులు ఎప్పటినుంచో కోరుతున్నా.. ఎప్పుడూ ఒక్కడుగు ముందుకు.. రెండడుగులు వెనక్కి అన్నట్లు ఉంది. కేంద్ర ప్రభుత్వం నుంచి ఈసారి స్పష్టత వస్తుందన్న ఆశ ఉంది.

ఉమ్మడి జిల్లాలోని పర్యాటక ప్రాంతాలైన కాకతీయ కాలం నాటి దేవాలయాల అభివృద్ధి, టూరిజం సర్క్యూట్‌ల ఏర్పాటు భారీగా నిధులు ఇవ్వాలని కోరినట్లు ఎంపీలు కడియం కావ్య, బలరాం నాయక్ ప్రకటించారు.

ములుగు జిల్లాలో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుకు 360 ఎకరాల స్థల సేకరణ చేశారు. కనీసం రూ.250 కోట్లయినా కేటాయిస్తే యూనివర్సిటీ నిర్మాణ పనులు సాగే అవకాశం ఉండేది. గత బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఉన్న ఈ రెండు గిరిజన యూనివర్సిటీలకు కలిపి రూ.67 కోట్లు మాత్రమే కేటాయించగా.. ఈ ఏడాది ములుగులో పాత భవనంలో ప్రారంభమైన క్లాసులకు పలుమార్లు నోటిఫికేషన్ ఇచ్చినా 14 మందే అడ్మిషన్లు తీసుకున్నారు.

రైల్వేలైన్లు, స్టేషన్ల అభివృద్ధిపై ఆశలు

ఏళ్లు గడుస్తున్నా కాజీపేట జంక్షన్‌ను రైల్వే డివిజన్‌గా ప్రకటించాలన్న డిమాండ్ నెరవేరడం లేదు. కాజీపేటలో రైల్వే ఆక్ట్ అంప్రెంటీస్ ట్రెనింగ్ సెంటర్‌పైనా నాన్చివేత ధోరణి కొనసాగుతోంది. ఈ రెండింటిపై ఉద్యోగ, ప్రజా ఆందోళనలు తరచూ సాగుతున్నాయి. మణుగూరు – రామగుండం రైల్వేలైన్ సర్వే కోసం బడ్జెట్ కేటాయించిన కేంద్రంలో భూసేకరణ, నిర్మాణం కోసం నిధులు కేటాయిస్తారన్న ఆశతో ఉన్నారు. హసన్‌పర్తి – కరీంనగర్, డోర్నకల్ – మిర్యాలగూడ రైల్వేలైన్లు మంజూరు కాగా.. సర్వే, భూసేకరణ, నిర్మాణం కోసం కేటాయింపులు చేయాల్సి ఉంది. రైల్వే కోచ్ ఫ్యాక్టరీని వీలైనంత తొందరలో పూర్తి చేస్తామని చెప్పినా, సరిపడా నిధులు ఇవ్వడం లేదు. ఈ బడ్జెట్‌లో పెద్దమొత్తంలో నిధులు కేటాయిస్తే ఈ ఏడాది పూర్తవుతుందన్న నమ్మకం కలిగే అవకాశం ఉంది. కాజీపేట రైల్వే టౌన్ స్టేషన్ అభివృద్ధికి నిధులు కేటాయించాల్సి ఉంటుంది. కాజీపేట రైల్వే ఆస్పత్రిని సబ్‌డివిజన్ ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాల్సి ఉంది. స్టేషన్ ఘన్‌పూర్ నుంచి సూర్యాపేట వరకు కొత్త లైన్ ప్రతిపాదన జరిగింది. సగం సర్వే అయింది. ఈ బడ్జెట్‌లో నిధులిస్తే పూర్తి సర్వే జరిగి కొత్త లైన్‌కు శ్రీకారం జరుగుతుంది. ఇప్పటికైనా కాజీపేట జంక్షన్ నుంచి ముంబయి. విజయవాడ, కాగజ్‌నగర్ వరకు ఎక్స్‌ప్రెస్ రైళ్లను పారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

ఈ బడ్జెట్‌లోనైనా ప్రాధాన్యమివ్వాలి



ప్రతిసారీ కేంద్ర బడ్జెట్‌లో వరంగల్‌కు అన్యాయం జరుగుతోంది. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీకి పెద్ద మొత్తంలో నిధులు ఇవ్వాల్సి ఉంది. అలా అయితేనే పూర్తవుతుంది. కాజీపేటను రైల్వే డివిజన్‌గా చేయాలని కోరుతున్నా ఇప్పటికి నెరవేరడం లేదు. ఈసారి ప్రాధాన్యమివ్వాలి. విభజన చట్టంలో పేర్కొన్న అంశాలను నెరవేర్చడంలో ఆంధ్రాకు ప్రాధాన్యమిస్తున్న బీజేపీ తెలంగాణను పట్టించుకోవడం లేదు.

- కడియం కావ్య, ఎంపీ, వరంగల్

మేలు జరుగుతుందని ఆశిస్తున్నాం..



మహబూబాబాద్ జిల్లాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు ప్రాధాన్యమివ్వాలి. డోర్నకల్–మిర్యాలగూడ రైల్వేలైన్ నిర్మాణానికి కేటాయింపులు చేయాల్సి ఉంది. మేం చేసిన ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకుంటుందని ఆశిస్తున్నాం. ఆంధ్రప్రదేశ్‌పై చూపుతున్న ప్రేమ తెలంగాణపై చూపకపోవడం అన్యాయం. బడ్జెట్‌లో మేలు జరుగుతుందని ఆశిస్తున్నా.

- పోరిక బలరాం నాయక్, ఎంపీ, మహబూబాబాద్

పనిష్మెంట్లు ఎదుర్కొన్నా ఉత్తముడే!

- ఏసీబీకి చిక్కినా.. వారు ఉత్తమ ఉద్యోగులేనట!
- ఎన్పీడీసీఎల్‌లో ఉత్తమ ఉద్యోగుల ఎంపికలో బాధ్యతారాహిత్యం



హన్మకొండ: ఉత్తమ ఉద్యోగులను ఎంపిక చేయడంలో టీజీ ఎన్పీడీసీఎల్ ఉన్నతాధికారులు నిబంధనలకు తిలోదకాలిస్తున్నారా.. ఉత్తమ ఉద్యోగి అనే పదానికి నిర్వచనాన్ని మార్చేస్తున్నారా? అంటే ఇటీవల గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఎంపిక చేసిన ఉత్తమ ఉద్యోగుల జాబితాను పరిశీలిస్తే అవుననే సమాధానం వస్తోంది. నిబద్ధత, సేవ, అంకితభావం, వృత్తిలో ప్రతిభ కనబర్చేవారు, వృత్తిలో నూతన ఒరవడిని సృష్టించి అధునాతన సాంకేతికను అందిపుచ్చుకుని పనిచేసే వారిని ఉత్తమ ఉద్యోగిగా ఎంపిక చేయాలి. కానీ, టీజీ ఎన్పీడీసీఎల్‌లో మాత్రం భిన్నంగా అక్రమార్కులు, క్రమశిక్షణ చర్యల కింద సస్పెన్షన్‌కు గురైన వారు, ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా చిక్కిన వారిని ఎంపిక చేయడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల జరిగిన రిపబ్లిక్ డే సందర్భంగా టీజీ ఎన్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో పనిచేస్తున్న వారినుంచి 175మందిని ఉత్తమ ఉద్యోగులుగా ఎంపిక చేశారు. వీరిలో కొందరు ఉద్యోగులు, అధికారుల్లో ఏసీబీ చిక్కిన, క్రమశిక్షణ చర్యల్లో రెండుసార్లు సస్పెన్షన్‌కు గురైన వారు ఉన్నారు. గతంలోనూ ఇలాగే పలు ఆరోపణలు, అక్రమాలకు పాల్పడి విచారణ ఎదుర్కొంటున్న వారిని ఎంపిక చేసి అభాసుపాలయ్యారని, అయినా ఉన్నతాధికారుల తీరులో మార్పు రాలేదని ఎన్పీడీసీఎల్ కార్యాలయ సిబ్బంది మండిపడుతున్నారు. ఇకనుంచైనా.. ఉత్తమ ఉద్యోగులుగా ఎంపిక చేసిన జాబితాను సీఎండీ నిశితంగా పరిశీలించిన తర్వాతే తుది జాబితా రూపొందిస్తే బాగుంటుందని విద్యుత్ ఉద్యోగులు కోరుతున్నారు.

ఎకో టూరిజం పార్కుకు స్థలం ఎంపిక చేయాలి

కలెక్టర్ ప్రావీణ్య



సమీక్షలో కలెక్టర్ ప్రావీణ్య, అధికారులు

హన్మకొండ అర్బన్: ‘కుడా’ ప్రతిపాదించిన ఎకో టూరిజం పార్కు ఏర్పాటుకు ధర్మసాగర్ మండలంలోని ఇనుపరాతి గుట్టల్లో అనువైన స్థలం ఎంపికను అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులతో ఆమె సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. ప్రతిపాదిత స్థలం ఎంపిక కోసం అటవీ, రెవెన్యూ, కుడా అధికారులు కలిసి స్థలాన్ని ఎంపిక చేయాలని సూచించారు. స్థలం ఎంపికకు ఎలాంటి సమస్యలు రాకుండా పూర్తి చేసి ‘కుడా’కు అప్పగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈపార్కు ఏర్పాటైతే ప్రజలు, పిల్లలకు సంబంధించిన కార్యక్రమాలతో పాటు హాట్ బెలూన్స్, వాటర్ స్పోర్ట్స్, రకరకాల పక్షులను చూడవచ్చని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి లావణ్య, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, హనుమకొండ ఆర్డీఓ రాథోడ్ రమేశ్, ‘కుడా’ సీపీఓ అజిత్‌రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అవార్డులకు ప్రతిపాదనలు నమోదు చేయండి

వరంగల్ కలెక్టర్ సత్యశారద



పీఎం అవార్డుల సమావేశంలో మాట్లాడుతున్న వరంగల్ కలెక్టర్ సత్య శారద

వరంగల్: ప్రధాన మంత్రి (పీఎం) అవార్డుల కోసం ప్రతిపాదనలతో కూడిన వివరాలను సంబంధిత వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. 2022 ఏప్రిల్ నుంచి 2024 డిసెంబర్ చివరి నాటికి వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుకు సంబంధించిన వివరాలతో సమగ్ర నివేదికలను రూపొందించాలన్నారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌ఓ విజయలక్ష్మి, డీఆర్డీఓ కౌసల్యాదేవి, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, డీఏఓ అనురాధ, డీఎంహెచ్‌ఓ సాంబశివరావు, డీవీహెచ్‌ఓ బాలకృష్ణ, పీఆర్ ఈఈ ఇజ్జగిరి, డీసీపీఓ శ్రీదేవి, బల్దియా ఉప కమిషనర్ ప్రసన్నారాణి, మెప్మా టీఎంసీ రమేశ్ పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ తప్పనిసరి

ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పనిసరి అని వరంగల్ కలెక్టర్ సత్యశారద పేర్కొన్నారు. జిల్లా రోడ్లు, భవనాల శాఖ అధికారి జితేందర్‌రెడ్డి, మిషన్ భగీరథ ఈఈ వెంకటరమణారెడ్డి, జిల్లా ఉపాధి కల్పనాధికారి ఉమారాణి శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం ముగ్గురు అధికారులను కలెక్టర్, అధికారులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, డీఆర్డీఓ కౌసల్యాదేవి, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, టీడబ్ల్యూఐడీసీ ఎస్‌ఈ నరేందర్‌రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.









నడక ప్రమాదం.. స్పృహ అవశ్యకం

నగరంలోని ప్రధాన రోడ్లపై వాహనాలు రయ్..రయ్‌మంటూ దూసుకెళ్తున్న సమయంలో పాదచారులు డివైడర్ల మధ్యలోనుంచి రోడ్డుదాటుతుండడంతో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. వేగంగా వచ్చే వాహనాలు ఒక్కోసారి అదుపుతప్పి ఢీకొంటున్నాయి. హైదరాబాద్, బెంగళూరులాంటి నగరాల్లో ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద పాదచారులకు ప్రత్యేక లైన్లు వేసి కొంతసమయం ఇస్తారు. ఇక్కడ కూడా అలాంటివి ఏర్పాటు చేయాల్సి ఉంది. నగరవాసులు కూడా పొరస్పృహతో రోడ్డు దాటాల్సిన అవసరం ఉంది.

- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ

రిటైర్డ్ పోలీసుల సేవలు ఆదర్శం: సీపీ



వరంగల్ క్రైం: నేటితరం పోలీసులకు రిటైర్డ్ పోలీసుల సేవలు ఆదర్శంగా నిలుస్తాయని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. సుదీర్ఘకాలం కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులు ఎస్సైలు సారంగపాణి, రవీందర్, రమేశ్, గోవర్ధన్‌ను సీపీ అంబర్ కిషోర్ ఝా శుక్రవారం సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. ఈసందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఉద్యోగ విరమణ అనంతరం ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, నిత్యం వ్యాయామం చేసేలా సమయాన్ని కేటాయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ రవి, సురేశ్‌కుమార్, ఏసీపీ పార్థసారథి, సురేంద్ర, ఆర్‌ఐలు సతీశ్, శ్రీనివాస్, ఆర్ఎస్సై శ్రవణ్, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ క్రీడల్లో రాణించిన ఏసీపీలు



వరంగల్ క్రైం: కరీంనగర్ కేంద్రంగా జరుగుతున్న రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడల్లో వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన ఏసీపీలు మధుసూదన్, అనంతయ్య, జితేందర్‌రెడ్డి రాణించారు. బ్యాడ్మింటన్ క్రీడలో 55 ఏళ్ల విభాగం డబుల్స్‌లో జితేందర్‌రెడ్డి–మధుసూదన్ జోడి బంగారు పతకాన్ని గెలుచుకోగా.. బ్యాడ్మింటన్ 53 ఏళ్ల వయస్సు డబుల్స్ విభాగంలో జితేందర్‌రెడ్డి–అనంతయ్య జోడి కాంస్య పతకాన్ని గెలుచుకున్నారు. బ్యాడ్మింటన్‌లో జితేందర్‌రెడ్డి కాంస్య పతకాన్ని గెలుచుకున్నాడు. విజేతలుగా నిలిచిన ఏసీపీలను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, జట్టు మేనేజర్ నాగయ్య అభినందించారు.

లక్ష్యంపై ఫోకస్ పెట్టండి..

- 60 రోజుల్లో రూ.71.10 కోట్ల పన్నులు వసూలు చేయాలి
- అధికారులతో కమిషనర్ అశ్విని తానాజీ సమీక్ష



మాట్లాడుతున్న కమిషనర్ అశ్విని తానాజీ

సాక్షి ఎఫెక్ట్

వరంగల్ అర్బన్: ‘గడువు కేవలం రెండు నెలలే ఉంది. ఈలోగా ఆస్తి, నీటి, చెత్త పన్ను బకాయిలు రూ.71.10 కోట్లు వసూలు చేయకపోతే శాఖాపరమైన చర్యలు తప్పవు’ అని గ్రేటర్ వరంగల్ కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను హెచ్చరించారు. శుక్రవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో ఆర్‌ఐలు, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లతో పన్ను వసూళ్ల పురోగతిపై సమీక్ష ఏర్పాటు చేశారు. ఇందులో కమిషనర్ మాట్లాడుతూ.. పతీ వార్డు, ఆఫీసర్ వారి, డివిజన్లలో పెద్ద మొత్తంలో బకాయిలు ఉన్న వారి జాబితాను సిద్ధం చేసుకుని వసూలు చేయాలన్నారు. ప్రాపర్టీ టాక్స్ వసూళ్ల లక్ష్యం చేరుకోవాలని ఆదేశించారు.

గ్రీవెన్స్ ఫిర్యాదులకు ప్రాధాన్యం ఇవ్వండి

గ్రీవెన్స్‌సెల్‌కు వచ్చిన ప్రతీ దరఖాస్తు పరిష్కారానికి అధికారులు, సిబ్బంది చొరవ చూపాలని గ్రేటర్ వరంగల్ కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే హెచ్చరించారు. ఈనెల 29న ‘సాక్షి’ దినపత్రికలో ప్రచురితమైన ‘గ్రీవెన్స్ సెల్‌పై సమీక్షలు కరువు’ కథనానికి కమిషనర్ స్పందించారు. శుక్రవారం బల్దియా ప్రధాన కార్యాలయం కౌన్సిల్ హాల్‌లో అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. 2024 ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు డ్యాష్ బోర్డులో నమోదైన ఫిర్యాదులన్నింటినీ పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్ గ్రీవెన్స్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రొఫార్మా తయారు చేయాలని సిటీ ప్లానర్‌ను కమిషనర్ ఆదేశించారు. సివిల్ సంబంధిత సమస్యలుంటే.. సిటీ ప్లానర్ క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. భూ సమస్యలు ఉంటే పరిష్కారమయ్యేవరకు ఎలాంటి అనుమతులివ్వకూడదని పేర్కొన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలనలో పురోగతి లేదని వాటి పరిశీలనలపై దృష్టి సారించాలని కమిషనర్ ఆదేశించారు. ఆయా సమావేశాల్లో అడిషనల్ కమిషనర్ జోనా, డిప్యూటీ కమిషనర్లు రవీందర్, ప్రసన్నరాణి, పన్నుల అధికారి రామకృష్ణ, రెవెన్యూ అధికారులు షహజాదీ బేగం శ్రీనివాస్ యూసుఫొద్దీన్, ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ఏసీపీలు శ్రీనివాస్‌రెడ్డి, రజిత, ఖలీల్, ఆర్‌ఐలు, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలు తగ్గించాలి

వరంగల్ డీఎంహెచ్‌ఓ సాంబశివరావు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ సాంబశివరావు

గీసుకొండ: జిల్లాలో మాతాశిశు మరణాలు తగ్గించాలని వరంగల్ డీఎంహెచ్‌ఓ సాంబశివరావు వైద్యాధికారులకు సూచించారు. ఆర్మాన్ స్వచ్ఛంద సంస్థ, జాతీయ ఆరోగ్య మిషన్ సంయుక్తంగా ఇంటిగ్రేటెడ్ హైరిస్క్ ప్రెగ్నెన్సీ ట్రాకింగ్ అండ్ మేనేజ్‌మెంట్ ట్రెనింగ్ (ఐహెచ్‌ఆర్‌పీటీఎం)పై శుక్రవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో వైద్యాధికారులు, ఆరోగ్య కార్యకర్తలకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ గర్భిణులకు అన్ని రకాల వైద్యపరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రమాదకర సూచనలుంటే.. తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చికిత్సకు ఎవరి వద్దకు రిఫర్ చేయాలి అనే అంశాలను వివరించారు.

క్లుప్తంగా

నిరుద్యోగులకు ఉపాధి ఆధారిత సాంకేతిక శిక్షణ

వరంగల్ : గ్రామీణ నిరుద్యోగ యువకులకు ఉచిత, ఉపాధి ఆధారిత సాంకేతిక శిక్షణ ఇచ్చేందుకు అర్హత, ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్ యోజన పథకంలో యువతకు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మండలం జలాల్‌పూర్‌లోని స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థలో శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. బేసిక్ కంప్యూటర్స్ (డాటా ఎంట్రీ ఆపరేటర్), కంప్యూటర్ హార్డ్‌వేర్ (ఇంటర్), అకౌంట్ అసిస్టెంట్, ట్యాలీ (బీకాం), ఆటోమొబైల్, 2 వీలర్ సర్వీసింగ్, సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేర్ (పదో తరగతి), ఎలక్ట్రీషియన్–డొమెస్టిక్, సోలార్ సిస్టమ్స్ ఇన్‌స్టలేషన్, రిపేర్ (టెన్త్, ఐటీఐ) కోర్సుల్లో ఉచిత శిక్షణతో పాటు భోజన వసతితో పాటు ఉద్యోగం కల్పించబడుతుందన్నారు. 18–30ఏళ్ల వయస్సు కలిగిన గ్రామీణ అభ్యర్థులు అర్హులని తెలిపారు. అడ్మిషన్లు 3వ తేదీ (సోమవారం) నుంచి స్వీకరిస్తారని ఇతర వివరాలకు 91339 08000, 91339 08111, 91339 08222, 99484 66111 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రైల్వే జనరల్ ఇన్‌స్టిట్యూట్ తనిఖీ



జిమ్‌ను తనిఖీ చేస్తున్న జయశంకర్ చౌహాన్

కాజీపేట రూరల్ : కాజీపేట రైల్వే జనరల్ ఇన్‌స్టిట్యూట్‌ను దక్షిణ మధ్య రైల్వే డిప్యూటీ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ (సీపీఓ) వెల్ఫేర్ జయశంకర్ చౌహాన్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చౌహాన్ ఇనిస్టిట్యూట్‌లోని బిలియర్డ్స్, చెస్, క్యారమ్స్, టేబుల్ టెన్నిస్, జిమ్, గ్రంథాలయం, కమ్యూనిటీహాల్‌ను సందర్శించారు. ఇనిస్టిట్యూట్ నిర్వాహణ చాలా బాగుందని అభినందించినట్లు ఇనిస్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్ తెలిపారు. కార్యక్రమంలో రైల్వే ఈఎల్ఎస్ సీనియర్ డీఈఈ ప్రశాంత కృష్ణసాయి, ఏపీఓ ఆర్.వి.ఎస్.ఆర్.కె.ప్రసాద్, వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్లు భిక్షపతి, సరళామాధవి, సీహెచ్ సంధ్య, ఎం.రాజయ్య, గిరిమిట్ల రాజేశ్వర్, సిబ్బంది రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

'ఐక్య ఉద్యమాలతోనే రాజ్యాధికారం'




సంఘీభావం తెలుపుతున్న బీసీ సంఘాల నాయకులు

హన్మకొండ : ఐక్య ఉద్యమాలతోనే రాజ్యాధికారం సాధించుకుంటామని బీసీ ఇంటలెక్చువల్ ఫోరం ఉమ్మడి వరంగల్ జిల్లా చీఫ్ కో ఆర్డినేటర్ డాక్టర్ కొంగర వీరస్వామి, ఆల్ ఇండియా ఓబీసీ జేఏసీ చైర్మన్ సాయిని నరేందర్ అన్నారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనతో పాటు కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలనే డిమాండ్‌తో 13 రోజులుగా ఉమ్మడి జిల్లాలో కొనసాగుతున్న బీసీ ఆజాదీ సైకిల్ యాత్ర శుక్రవారం రాత్రి హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకుంది. ఈయాత్రకు బీసీ కుల, వృత్తి సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. బీసీ ఉద్యమానికి ఊపిరిలా నిలుస్తున్న ఉద్యమకారులకు మద్దతుగా నిలవాల్సిన బాధ్యత బీసీలందరిపై ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సైకిల్ యాత్ర సారథులు బత్తుల సిద్ధేశ్వర్, చాపర్తి కుమార్, బీసీ సంఘాల నాయకులు డాక్టర్ కూరపాటి రమేశ్, గొల్లపల్లి వీరస్వామి, డాక్టర్ చంద మల్లయ్య, సిలువేరు శంకర్, దిడ్డి ధనలక్ష్మి, తాటికొండ సద్గుణ, నరహరి, నవ్య, సతీశ్, శోభారాణి, కృష్ణ పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారానికి బ్రేక్!

ఏనుమాముల మార్కెట్ కమిటీ కొలువుదీరేందుకు 'కోడ్' అడ్డు

- ఈసీ అనుమతిస్తేనే బాధ్యతలు చేపట్టనున్న పాలకవర్గం
- జీఓపై ఫైల్‌ను సర్క్యులేట్ చేయని మార్కెటింగ్ శాఖ డైరెక్టర్
- ఒకే వర్గానికి పదవులు ఇవ్వడంతో తూర్పు కాంగ్రెస్‌లో అసంతృప్తి



ఏనుమాముల వ్యవసాయ మార్కెట్

వరంగల్ : 'అన్ని ఉన్నా అల్లుడి నోట్లో శని' అన్న చందంగా తయారైంది వరంగల్‌లోని ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం పరిస్థితి. ఏడాదిన్నర తర్వాత ఎట్టకేలకు మోక్షం లభించిన వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారానికి ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అడ్డుగా మారింది. మార్కెట్ పాలకవర్గం ఏర్పాటు చేస్తూ గత నెల 28వ తేదీన సంబంధిత శాఖ ప్రత్యేక కార్యదర్శి జీఓ జారీ చేశారు. మెదక్–నిజామాబాద్–ఆదిలాబాద్–కరీంనగర్ ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గం, వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గానికి 29న ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసింది. దీంతో ఏడు జిల్లాల్లో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది.

రగిలిన అసంతృప్తి..

వరంగల్ వ్యవసాయ మార్కెట్ పాలకవర్గం ఏర్పాటు వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని కాంగ్రెస్ శ్రేణుల్లో ఆజ్యం పోసినట్లు అయ్యిందన్న ప్రచారం జరుగుతోంది. పదేళ్లపాటు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నాయకులు, కార్యకర్తల నుంచి చిత్కారాలు, అవమానాలకు గురైనా తమకు ఎలాంటి ప్రాధాన్యం దక్కడం లేదని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కొనసాగి.. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికే కొండా దంపతులు ప్రాధ్యానం ఇస్తున్నారని పేర్కొంటున్నారు. వారికే అధికారాలు కట్టబెట్టడంపై పలువురు కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ వర్గంగా ఏర్పడి పార్టీ కార్యక్రమాలను ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారు. ఎన్నికల్లో కొండా సురేఖ గెలుపు కోసం పనిచేస్తే ముందు నుయ్యి, వెనుక గొయ్యి అన్న చందంగా తమ పరిస్థితి తయారైందని సీనియర్ నాయకులు, కార్యకర్తలు వాపోతున్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో కనీసం పార్టీ జెండా ఎత్తేందుకు రాని వారు ఇప్పుడు ముందు వరుసలో కూర్చోవడమే కాకుండా ఏ పని ఉన్నా వారి వద్దకు వెళ్లాలని కొండా దంపతులు సూచిస్తుండడంతో దూరంగా ఉంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ కమిటీలోనైనా అవకాశం దక్కుతుందని ఆశపడిన సీనియర్లకు అవకాశం కల్పించలేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికే కొందరికే ప్రాధాన్యం ఇస్తున్నారన్న ప్రచారం జరుగుతుండగా.. కమిటీలో ఒకేవర్గానికి పదవులు సైతం రావడంతో సీనియర్లు బాహాటంగా పెదవి విరుస్తున్నారు.

కమిటీలో మార్పులు.. చేర్పులు?

మార్కెట్ పాలకవర్గంలో స్వల్ప మార్పులు, చేర్పులు జరిగే అవకాశాలున్నట్లు ప్రచారం జరుగుతోంది. 28న జీఓ జారీ అయ్యింది. 31 వరకు సంబంధిత శాఖ నుంచి క్లియరెన్స్ రాలేదు. ఎన్నికల కోడ్‌తోపాటు మార్పులు ఉంటాయని పలువురు చర్చించుకుంటున్నారు. మార్కెట్ పాలకవర్గంలో పదవులపై ఆశలు పెట్టుకున్న వారంతా టీపీసీసీకి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఎన్నికలకు ముందు నియోజకవర్గ బాధ్యతలు, రైతు డిక్లరేషన్ సభ నిర్వహణకు అహర్నిశలు కష్టపడిన తనకు ఎందుకు అవకాశం కల్పించలేదని వర్ధన్నపేటకు చెందిన సీనియర్ నాయకుడు అధిష్టానం దృష్టికి తీసుకుపోయినట్లు సమాచారం. దీనికి తోడు తూర్పులో సీనియర్లను విస్మరించి కొత్తగా పార్టీలోకి వచ్చిన వారికి అవకాశం కల్పించారంటూ ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అందువల్ల పాలకవర్గంలో మార్పులు చేసేందుకే సంబంధిత శాఖ నుంచి ఆదేశాలు రావడంలో జాప్యం జరుగుతోందని టాక్. ఈ మార్పు చైర్మన్ పదవికా, సభ్యులకా అనే విషయంపై మార్చి 8వ తేదీ (ఈసీ అనుమతి ఇవ్వకుంటే) వరకు ఆగాల్సిందే.

ఫైల్‌ను సర్క్యులేట్ చేస్తేనే..

రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ ఈ జీఓపై ఫైల్‌ను స్థానిక అధికారులకు సర్క్యులేట్ చేస్తేనే కొత్త చైర్మన్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తారు. జీఓ జారీ అయినప్పటికీ ఫైల్ 31వ తేదీ వరకు సర్క్యులేట్ కాకపోవడానికి ఎన్నికల కోడ్ అడ్డుగా మారిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మార్కెటింగ్ శాఖ అధికారులు ఎన్నికల కమిషన్ నుంచి ప్రత్యేకంగా అనుమతి తీసుకుంటేనే కొత్త పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేసే అవకాశాలు ఉన్నాయి.

కేయూ రిజిస్ట్రార్‌గా రామచంద్రం



బాధ్యతలు స్వీకరిస్తున్న రామచంద్రం

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ నూతన రిజిస్ట్రార్‌గా దూరవిద్యాకేంద్రం పొలిటికల్ సైన్స్ విభాగం ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంను నియమించగా అసిస్టెంట్ రిజిస్ట్రార్ ప్రణయ్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఇన్నాళ్లు రిజిస్ట్రార్‌గా బాధ్యతలు నిర్వర్తించిన ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి పదవీ ముగియడంతో రామచంద్రంను నియమించారు. ఈమేరకు వీసీ ఆచార్య కె.ప్రతాప్‌రెడ్డి ప్రొఫెసర్ రామచంద్రంకు శుక్రవారం ఉత్తర్వులు అందజేశారు.

33ఏళ్ల అనుభవం..

అధ్యాపకుడిగా కొనసాగుతున్న రామచంద్రం పర్యవేక్షణలో ఆరుగురు పరిశోధకులు డాక్టరేట్లు, నలుగురు పరిశోధకులు ఎంఫిల్ పట్టా పొందారు. దూరవిద్యకేంద్రంలో ప్రొఫెసర్‌గా ఉంటూ రిజిస్ట్రార్ పదవిలో నియమితులైన వారిలో ప్రొఫెసర్ రామచంద్రం రెండో వ్యక్తి. గతంలో దూరవిద్యాకేంద్రం డైరెక్టర్‌గా పనిచేస్తూ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రావు కేయూ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు నిర్వర్తించారు.

పాలన పదవులు ఇలా..

కేయూ దూరవిద్యా కేంద్రం జాయింట్ డైరెక్టర్‌గా ఉన్నప్పటి నుంచి సుమారు 20 ఏళ్లుగా ఎమ్మెస్సీ సైకాలజీ విభాగం అధిపతిగా కొనసాగుతూనే ఇతర పాలన బాధ్యతలు నిర్వర్తించారు. గతంలో అదనపు పరీక్షల నియంత్రణాధికారిగా, కేయూ అభివృద్ధి అధికారిగా, పొలిటికల్ సైన్స్ విభాగం అధిపతిగా బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం కేయూ దూరవిద్యా కేంద్రం డైరెక్టర్‌గా, సైకాలజీ విభాగం అధిపతిగా, యూనివర్సిటీ సీడీసీ డీన్‌గా, విశ్వవిద్యాలయం విద్యాకళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గాను బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇప్పుడు రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించి, సంవత్సరం పాటు ఈ పదవిలో ఉంటారు. రామచంద్రం ఈ ఏడాది జూన్‌లో ఉద్యోగ విరమణ పొందాల్సిండేది. కానీ ప్రభుత్వం ప్రొఫెసర్ల వయోపరిమితిని 65 ఏళ్లకు పెంచడంతో ఆయన మరో ఐదేళ్లకుపైగా సర్వీస్‌లో ఉండబోతున్నారు.

1991లో దూరవిద్య కేంద్రంలో నియమితులై..

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం సర్వాపూర్ గ్రామానికి చెందిన రామచంద్రం ఉస్మానియా యూనివర్సిటీలో 1989లో ఎంఏ పొలిటికల్ సైన్స్, 1991లో ఓయూలో బీఈడీ పూర్తిచేశారు. 1992లో మధురై కామరాజ్ యూనివర్సిటీలో ఎంఈడీ, 2004లో ఎమ్మెస్సీ సైకాలజీ తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీలో పూర్తి చేశారు. ఓయూలో 1992లో పొలిటికల్ సైన్స్‌విభాగంలో ఎంఫిల్, 1999లో ఓయూ నుంచే పీహెచ్‌డీ పూర్తిచేసి డాక్టరేట్ సాధించారు. అలాగే కాకతీయ యూనివర్సిటీలోని విద్యావిభాగంలో 2009లో డాక్టరేట్, 2012లో తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో సైకాలజీ విభాగంలో డాక్టరేట్‌ను సాధించారు. కేయూ దూరవిద్యాకేంద్రంలో ఎస్‌డీఎల్‌సీఈ పొలిటికల్ సైన్స్ విభాగం 1991లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియామకం అయి అసోసియేట్, అనంతరం ప్రొఫెసర్‌గా పదోన్నతులు పొందారు.


శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



శిక్షణలో మాట్లాడుతున్న సుజన్ తేజ

కాశోజీ సెంటర్: విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులకు శిక్షణ ఉపయోగపడుతుందని వరంగల్ జిల్లా మానిటరింగ్ అధికారి సుజన్‌తేజ అన్నారు. వరంగల్‌లోని శంభునిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రెండు రోజులపాటు ఉపాధ్యాయులకు కెరీర్ గైడెన్స్, కౌన్సెలింగ్‌పై నిర్వహించిన శిక్షణ శుక్రవారం ముగిసింది. ఈ సమావేశంలో డీసీఈబీ కార్యదర్శి కృష్ణమూర్తి, రిసోర్స్ పర్సన్స్ భారతి, కృష్ణారెడ్డి, సురేశ్, నాగేశ్వర్‌రావు, నాగార్జున రావు, హెచ్ఎం శారదాబాయి పాల్గొన్నారు.

'ఆరోగ్యశ్రీ సేవలు' తెలుసుకోండిలా!



కాజీపేట : పేదల వైద్యానికి భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకం 'రాజీవ్ ఆరోగ్యశ్రీ'.. కార్పొరేట్ స్థాయిలో పేదలకు ఉచితంగా వైద్యం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ సేవల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచింది. ఇటీవల ఈ పథకంలో 163 చికిత్సలను కొత్తగా జతచేయగా, మొత్తం 1,835 వైద్య సేవలు పొందవచ్చు. రాజీవ్ ఆరోగ్యశ్రీ కార్డును ఆమోదించే ఆస్పత్రుల్లో మాత్రమే ఉచితంగా వైద్యం పొందే అవకాశం ఉంది. మీ దగ్గరలోని ఆస్పత్రుల్లో రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం సేవలు ఉన్నాయో, లేదో ఫోన్‌లో కాని, కంప్యూటర్‌లో కాని సులువుగా తెలుసుకోవచ్చు. అదేలాగో చూద్దాం..

- కంప్యూటర్ లేదా స్మార్ట్‌ఫోన్‌లోని ఏదేని బ్రౌజర్‌లో ముందుగా www. rajivaarogyasri. telangana. gov. inరాజీవ్ ఆరోగ్యశ్రీ పోర్టల్ ఓపెన్ చేయాలి.
- అనంతరం టాప్ సర్వీస్ బార్‌లో కనిపించే హాస్పిటల్స్ అనే ఆప్షన్‌పై క్లిక్ చేయాలి.
- అప్పుడు రాజీవ్ ఆరోగ్యశ్రీ ఆస్పత్రులు అని నొక్కితే మీకు search by geography, serch by speciality, serch by locality అనే మూడు ఆప్షన్లు కనిపిస్తాయి.
- ఈ మూడు ఆప్షన్ల ద్వారా దగ్గర్లోని రాజీవ్ ఆరోగ్యశ్రీ సేవలు ఆస్పత్రులను తెలుసుకోవచ్చు. మీరు ఎంచుకున్న ఆప్షన్లపై క్లిక్ చేస్తే కొత్తపేజీ ఓపెన్ అవుతుంది.
- మీరు ఎంచుకున్న దాని ప్రకారం సెర్చ్ ఆప్షన్‌లో మీ జిల్లా, మండలం, హాస్పిటల్, స్పెషాలిటీ, ప్రభుత్వ లేదా ప్రైవేట్ అని ఎంపిక చేసుకోవాలి.
- అనంతరం అందుబాటులో ఉన్న ఆస్పత్రులు కనిపిస్తాయి. ఆస్పత్రి చిరునామా, ఆరోగ్యమిత్ర సభ్యుల పేర్లు, వారి ఫోన్ నంబర్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద అందించే సేవల వివరాలను చూడొచ్చు.

స్త్రీ విజయానికి పురుషుడు అండగా నిలవాలి

- ప్రొఫెసర్ చేతన్ శ్రీవాత్సవ
- పింగిళిలో ముగిసిన జాతీయ సదుస్సు



పరిశోధన పత్రాలు సమర్పించిన విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న అతిథులు

హన్మకొండ అర్బన్ : స్త్రీ విజయం సాధించేలా పురుషుడు వారికి అండగా నిలవాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ చేతన్ శ్రీవాత్సవ పేర్కొన్నారు. వరంగల్‌లోని పింగిళి మహిళా కళాశాలలో 'ఫైనాన్సియల్ లిటరసీ అండ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్ ఇన్ ఇండియా చాలెంజస్ అండ్ అపర్చునిటీస్ 'అనే అంశంపై రెండోరోజుల పాటు నిర్వహించిన జాతీయ సదస్సు శుక్రవారం ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి అధ్యక్షత వహించగా ప్రొఫెసర్ చేతన్ శ్రీవాత్సవ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ చేతన్ శ్రీవాత్సవ మాట్లాడుతూ.. దేశానికి ఆర్థిక శాఖ మంత్రిగా నిర్మలా సీతారామన్ సమర్థవంతంగా నిర్వహిస్తూ, మహిళా ఆర్థిక సాధికారతకు నిదర్శంగా నిలుస్తారన్నారు. ఈ సదస్సుకు ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి 196 పరిశోధన పత్రాలు రావడం గర్వకారణమని తెలిపారు. పరిశోధన పత్రాలు సమర్పించిన అందరికీ అతిథుల చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో ఎన్ఐటీ ప్రొఫెసర్ ఆనంద్ కిషోర్, కేడీసీ ప్రిన్సిపాల్ జి.రాజారెడ్డి, సెమినార్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.రాజు, సదస్సు కన్వీనర్, కామర్స్ విభాగాధిపతి సారంగపాణి, బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలుగు విభాగం అధిపతి, బీఓఎస్ నియామకానికి కమిటీ



- సీనియారిటీ తేల్చి రిపోర్టు ఇవ్వాలని ఆదేశాలు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ తెలుగు విభాగం అధిపతి, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించిన ప్రొఫెసర్ ఏటూరు జ్యోతి ఇటీవల మృతిచెందారు. అయితే ఆ విభాగంలో ఇక రెగ్యులర్ ప్రొఫెసర్లు లేకపోవడంతో నలుగురు కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు పని చేస్తున్నారు. తెలుగు విభాగం అధిపతిగా, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా తమను నియమించాలని నలుగురు కూడా యూనివర్సిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పరస్పర ఆరోపణలతో వినతిపత్రాలు అందజేశారు. వాస్తవంగా సీనియారిటీ ప్రాతిపదికన నియమించాల్సి ఉంటుంది. ఆరోపణలతో పాటు తమకే పదవులు ఇవ్వాలని నలుగురు ఆశిస్తుండటంతో వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు రెండ్రోజుల క్రితం కేయూ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు నిర్వర్తించిన ప్రొఫెసర్ పి.మల్లారెడ్డితో (ప్రస్తుతం మాజీ రిజిస్ట్రార్) కూడిన కమిటీని నియమించారు. ఈ కమిటీ చైర్మన్‌గా కేయూ సోషల్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ టి.మనోహర్, సభ్యులుగా యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్, ఆర్ట్స్ డీన్‌గా బాధ్యతలను నిర్వర్తిస్తున్న ఆచార్య బి.సురేష్ లాల్, దూర విద్య కేంద్రం డైరెక్టర్, సీడీసీ డీన్‌గా బాధ్యతలను నిర్వర్తిస్తున్న ప్రొఫెసర్ రామచంద్రంను (ప్రస్తుతం రిజిస్ట్రార్) నియమించారు. కన్వీనర్‌గా టీచింగ్ విభాగం అసిస్టెంట్ రిజిస్ట్రార్ ప్రణయ్‌కుమార్‌ను నియమించారు. ఈ కమిటీ తెలుగు విభాగంలో పనిచేస్తున్న నలుగురు కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లలో ఎవరు సీనియర్‌గా ఉన్నారు. ఎవరిని విభాగం అధిపతిగా, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా నియమించాలనేది పరిశీలించి రిపోర్టు ఇవ్వాలని రిజిస్ట్రార్ జారీచేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వారం రోజుల్లో రిపోర్టు ఇవ్వాల్సింటుంది. అయితే రిజిస్ట్రార్ మల్లారెడ్డి పదవీకాలం ముగిసింది. దూరవిద్యాకేంద్రం డైరెక్టర్‌గా ఉన్న రామచంద్రం రిజిస్ట్రార్‌గా బాధ్యతలను స్వీకరించారు. ఫిబ్రవరి 1న ఈ కమిటీ సమావేశమై పరిశీలించే అవకాశాలున్నాయి.

రోడ్డు భద్రత..అందరి బాధ్యత

- ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ డ్రైవింగ్ చేయాలి
- పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

హన్మకొండ : రోడ్డు భద్రత..అందరి బాధ్యత అని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా పేర్కొన్నారు. శుక్రవారం రాంనగర్‌లోని హనుమకొండ డిపోలో వరంగల్ రీజియన్ స్థాయి రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ రీజియన్‌లోని 9 డిపోల నుంచి ముగ్గురి చొప్పున సీనియర్ డ్రైవర్లను ఎంపిక చేసి ప్రశంసపత్రం అందించి శాలువాతో సన్మానించారు. ఈ సమావేశానికి పోలీసు కమిషనర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా, 40–50 మంది ప్రాణాలు డ్రైవర్ చేతిలో ఉంటాయన్న విషయాన్ని గమనిస్తూ డ్రైవింగ్ చేయాలని సీపీ కోరారు. ట్రాఫిక్ కూడళ్లలో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను మాట్లాడుతూ..ప్రతి డ్రైవర్ ఒత్తిడి లేకుండా డ్రైవింగ్ చేస్తూ ప్రమాదాలను నివారించి, ఆర్టీసీ సంస్థ మరింత సురక్షితమని ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఆర్టీసీ అంటే సురక్షిత ప్రయాణమనే నమ్మకం ఉందని..ఇదే నమ్మకంతో సురక్షిత డ్రైవింగ్ చేయాలన్నారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని ఆర్టీసీ ఉద్యోగులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సమావేశంలో ట్రెయినీ ఐపీఎస్ మన్సన్ భట్, ఆర్టీసీ డిప్యూటీ రీజినల్ మేనేజర్లు కేశరాజు భానుకిరణ్, మాధవరావు, డిపో మేనేజర్లు భూక్యా ధరంసింగ్, వంగల మోహన్‌రావు, వి.జ్యోత్స్న, రవిచంద్ర, ప్రసన్నలక్ష్మి, వి.పద్మావతి, ఇందు, శివ, స్వాతి, పర్సనల్ ఆఫీసర్ పి.అర్పిత, అసిస్టెంట్ మేనేజర్లు, సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పూలు కోసేందుకు వెళ్లి వ్యక్తి మృతి



సమ్మయ్య (ఫైల్)

కాళేశ్వరం : చెరువులో తామర పూలను కోసేందుకు వెళ్లి ప్రమాదశాత్తు నీటిలో మునిగి వ్యక్తి మృతిచెందిన సంఘటన మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ..మంచిర్యాల జిల్లా చెన్నూరుకు చెందిన మద్ద సమ్మయ్య (55) కాళేశ్వరం ఆలయం వద్దే ఉంటూ చెరువులో తామర పూలకోసం వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతిచెందాడు. సమ్మయ్య మృతదేహం కుళ్లిపోయి ఉండడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందజేశారు. మృతుడి భార్య రాజమ్మ సంఘటన స్థలానికి చేరుకొని సమ్మయ్య దుస్తులను పరిశీలించి గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తమాషారెడ్డి తెలిపారు.

గ్రేటర్‌లో అధికారుల బదిలీలు

వరంగల్ అర్బన్: గ్రేటర్ వరంగల్ పరిధిలో గురువారం రాత్రి బదిలీలు జరిగాయి. కాశిబుగ్గ డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి కొంపెల్లి మున్సిపాలిటీ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో భూపాలపల్లి కమిషనర్‌గా పని చేస్తున్న టి.రాజేశ్వర్‌రావు ఇక్కడికి బదిలీపై వచ్చారు. బల్దియా పన్నుల అధికారులు బిర్రు శ్రీనివాస్ భూపాలపల్లి కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నిజామాబాద్ జిల్లా భీంగల్ కమిషనర్ వై.రామకృష్ణ వరంగల్‌కు బదిలీపై వచ్చారు. వీరు బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేను కలిసి జాయినింగ్ రిపోర్ట్ అందజేశారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

కాశోజీ సెంటర్: ఉపాధి, పునరావాస పథకం ద్వారా ఆర్థిక స్వావలంబన పొందేందుకు దివ్యాంగుల నుంచి దరఖాస్తుల స్వీకరణ గడువు ఈనెల 12 వరకు పొడిగించినట్లు వరంగల్ జిల్లా సంక్షేమ శాఖ అధికారి బి.రాజమణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఈ పథకం కింద జిల్లాకు 13 యూనిట్ల ద్వారా రూ.6.50 లక్షల సబ్సిడీ మంజూరైందని పేర్కొన్నారు. వ్యవసాయ, అనుబంధ పరిశ్రమలు, సేవా వ్యాపారాలను స్థాపించుకుని జీవనోపాధి పొందేందుకు www.tsobmms.cgg.gov లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాల కోసం జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

మాలలను ప్రోత్సహిస్తున్న సీఎం రేవంత్

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య



సమావేశంలో మాట్లాడుతున్న రాజయ్య

హన్మకొండ : మాదిగలకు తమ మద్దతు అంటూనే, మాలలను సీఎం రేవంత్ రెడ్డి ప్రోత్సహిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య విమర్శించారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కమిటీల పేరుతో ఎస్సీ వర్గీకరణను కాలయాపన చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు చేవెళ్లలో ప్రకటించిన ఎస్సీ డిక్లరేషన్‌లో ఎస్సీ వర్గీకరణ ప్రకటిస్తామని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సమక్షంలో ప్రకటించారని, అగ్రనేత రాహుల్ కూడా ఎన్నికల సభల్లో ప్రకటించారని గుర్తు చేశారు. దీంతోపాటు 2023, ఆగస్టు 1న సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఎస్సీ వర్గీకరణ రాష్ట్రాలు చేసుకోవచ్చని తీర్పు ఇచ్చిన క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి దేశంలోనే అన్ని రాష్ట్రాలకంటే ముందుగా తెలంగాణలో అమలు చేస్తామని అసెంబ్లీ సాక్షిగా చెప్పినా ఆరు నెలలుగా తాత్సారం చేస్తూ వస్తున్నారని తూర్పారబట్టారు. మల్లికార్జున ఖర్గే మాల వర్గానికి చెందిన వారని, మరో వైపు వివేక్ వెంకటస్వామి కుటుంబం, మరో వైపు మల్లు బ్రదర్స్ నుంచి ఒత్తిడితో ఎస్సీ వర్గీకరణపై నిర్ణయం తీసుకుంటే పదవికి ముప్పు వస్తుందని వెనుకడుగు వేస్తున్నారన్నారు. సమావేశంలో జెడ్పీ మాజీ చైర్మన్ మారపల్లి సుధీర్ కుమార్, నాయకులు సోదా కిరణ్, మేకల అనిత, మేకల బాబురావు, మాజీ జెడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, మాజీ సర్పంచ్‌లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

వ్యర్థాలతో వస్తువుల తయారీ అభినందనీయం

- వరంగల్ జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్



ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న సైన్స్ అధికారి శ్రీనివాస్

కాశోజీ సెంటర్: విద్యార్థులు తమ సృజనాత్మకతతో వ్యర్థాలకు కొత్త రూపాన్ని ఇస్తున్నారని ఎన్‌జీసీ కో ఆర్డినేటర్, జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ కట్ల శ్రీనివాస్ అన్నారు. హంటర్ రోడ్డులోని గ్రీన్‌వుడ్ హైస్కూల్‌లో జిల్లాస్థాయి ఎన్‌జీసీ వేస్ట్ టు వెల్త్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. కార్యక్రమానికి డాక్టర్ కట్ల శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వివిధ మండలాల్లోని 32 పాఠశాలల నుంచి 75 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యర్థాలతో అలంకరణ వస్తువులు, ఆరోగ్య సాధనాలు తయారుచేయడం అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం ఎంఈఓ గంప అశోక్ విజేతలకు బహుమతులు అందజేశారు.

విజేతల వివరాలు..

నర్సంపేట బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మొదటి బహుమతి గెలుచుకొని రూ.3వేల నగదు పారితోషికం అందుకున్నారు. ద్వితీయ బహుమతి స్తంభంపల్లి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు అందుకుని రూ.2వేల నగదు పారితోషికం తీసుకున్నారు. తృతీయ బహుమతి నెక్కొండ టీఎస్ ఆర్ఎస్ విద్యార్థులు గెలుచుకొని రూ.వెయ్యి నగదు అందుకున్నారు. టీజీఎన్‌జీసీ రాష్ట్ర కోఆర్డినేటర్ విద్యాసాగర్‌రావు, గ్రీన్‌వుడ్ స్కూల్ ప్రిన్సిపాల్ మంజులాదేవి, డీన్ ఆఫ్ అకడమిక్ డాక్టర్ చిందరం రవీందర్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీకాంత్, రాజు, ధనలక్ష్మి పాల్గొన్నారు.

సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

హన్మకొండ: సోలార్ విద్యుత్ ఉత్పత్తి ద్వారా రైతులు ఆదాయం పొందవచ్చని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ సర్కిల్ ఎస్ఈ కె.వెంకటరమణ, వరంగల్ సర్కిల్ ఎస్ఈ మధుసూదన్‌రావు తెలిపారు. వ్యవసాయ యోగ్యం కాని భూములు, బంజరు భూముల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసి సౌర విద్యుత్ ఉత్పత్తి చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని వారు వేర్వేరు ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు ఆర్థికంగా పరిపుష్టం కావడానికి టీజీ రెడ్‌కో రైతులు, అర్హత కలిగిన వారి నుంచి సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకోవడానికి రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు ఫిబ్రవరి 22లోపు దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు టీజీ రెడ్కో డీజీఎం 63049 03933, జీఎం 90005 50974 నంబర్లలో సంప్రదించాలని కోరారు.